సాక్షి
కర్నూలు

శనివారం | 29 | మార్చి | 2025



మహానంది కిటకిట

మహానంది: శ్రీశైలం దర్శనం అనంతరం కన్నడిగులు మహానందికి తరలివస్తున్నారు. స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్నారు.



కనిపించదా కరువు!

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 55 మండలాలు ఉన్నాయి. వర్షాలు కురవక పంటలు పండకపోయినా 15 మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా ప్రతిపాదించారు. IIలో▸



ఆడపడుచుకు అగ్రాసనం

ఉగాది మహోత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు శ్రీశైలం వస్తున్నారు. భ్రమరాంబాదేవిని తమ ఇంటి ఆడపడుచుగా భావించి సారెను సమర్పిస్తున్నారు. IIలో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:35	ఉ॥ 4:53
ఆదోని	సా॥ 6:34	ఉ॥ 4:50
నంద్యాల	సా॥ 6:32	ఉ॥ 4:53
ఆత్మకూరు	సా॥ 6:32	ఉ॥ 4:48
బనగానపల్లె	సా॥ 6:34	ఉ॥ 4:51

హదీస్ వెలుగు:

పవిత్ర రంజాన్ మాసం నేర్పిన ఆధ్యాత్మికత, ఓర్పు, సహనం, దానధర్మాలు, ఆకలి దప్పికల నియంత్రణ పాఠాల స్ఫూర్తిని ఇతర నెలల్లోనూ కొనసాగించండి. – పవిత్ర ఖురాన్

పల్లె తూలుతోంది.. తమ్ముళ్లకు కిక్కెక్కుతోంది!

బెల్టు 'కిక్కు'!

- అధికార పార్టీ నాయకులే సూత్రధారులు
- లైసెన్స్‌డ్ షాపుల నుంచే మద్యం సరఫరా
- కాసుల కోసం తమ్ముళ్ల గ'మత్తు' దందా
- ఒక్కో దుకాణం నుంచి రూ.50 వేల నుంచి రూ.లక్ష ఇవ్వాలని కొందరు ఎమ్మెల్యేల హుకుం
- బెల్టు వ్యాపారంలో టీడీపీ నేతలదే క్రియాశీలక పాత్ర





225	60	5,000
ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాలు	ఉమ్మడి జిల్లాలో బార్లు	ఉమ్మడి జిల్లాలో అనధికార బెల్టు దుకాణాలు

కర్నూలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెలుగు తమ్ముళ్లు మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చుకున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జీల అండదండలతో ఊరూరా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. అనుమతి పొందిన దుకాణాల నుంచి అనధికారిక దుకాణాలకు నేతలే మద్యం సరఫరా చేస్తూ నిరుపేదల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు మాత్రం బెల్టు షాపులు నిర్వహిస్తే బెల్టు తీస్తానంటూ మాటలు చెప్పడమే తప్పిస్తే, జిల్లాలో అధికార పార్టీకి చెందిన ముఖ్య నేతలు, వారి అనుచరులే పల్లెల్లో బెల్టు షాపులను ప్రోత్సహిస్తుండటం గమనార్హం.

టీడీపీ నేతలదే క్రియాశీలక పాత్ర

ప్రతి పల్లెలో మూడుకు తక్కువ కాకుండా, మేజర్ గ్రామ పంచాయతీలో కనీసం 10 వరకు బెల్టు దుకాణాలు నడుపుతున్నారు. కూటమి ప్రభుత్వం మద్యం అమ్మకాలను ప్రైవేటుపరం చేయడంతో జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. గతంలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మద్యం విక్రయాలు సాగేవి. జిల్లాలో 90 శాతం దుకాణాలు కూటమి నేతలే దక్కించుకున్నారు. ఇప్పుడు వారంతా నిబంధనలు గాలికి వదిలి ఇష్టమొచ్చినట్లు వ్యాపారాలు సాగిస్తున్నారు. మద్యం వ్యాపారంలో కూటమికి చెందిన గ్రామస్థాయి నేత నుంచి ఎమ్మెల్యే వరకు ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది.

వేరే చోట తెచ్చుకుంటే తోలు తీస్తా..

కర్నూలు మండలంలో 23 గ్రామ పంచాయతీలు, మరో మూడు అనుబంధ గ్రామాలు ఉన్నాయి. వాటన్నింటికీ సంతోష్ నగర్ దుకాణం నుంచే మద్యం సరఫరా అవుతుంది. ''తనకు సంబంధించిన దుకాణం నుంచి కాకుండా వేరేచోట తెచ్చుకుని విక్రయాలు జరిపితే తోలు తీస్తా..'' అంటూ ఇటీవల ఆ ముఖ్య నేత హెచ్చరించినట్లు చర్చ జరుగుతోంది. ఉల్చాల గ్రామంలో ఇటీవల దేవర జరిగింది. దాదాపు రూ.10 లక్షలు విలువ చేసే మద్యాన్ని ఈ దుకాణం నుంచే బెల్టు షాపులకు సరఫరా చేసి ఉత్సవాల సందర్భంగా జనానికి తాపించినట్లు చర్చ జరుగుతోంది. అలాగే సుంకేసుల దుకాణం నుంచి బెళగల్ మండలంలోని పల్లెలకు ఆ నేత కనుసన్నల్లోనే బెల్టు షాపులకు మద్యం సరఫరా అవుతోంది. అలాగే పాణ్యం నియోజకవర్గం నేత కనుసన్నల్లో నడుస్తున్న కర్నూలు చెన్నమ్మ సర్కిల్‌లో ఉన్న మద్యం దుకాణం నుంచి కల్లూరు మండలంలోని మొత్తం గ్రామాల బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తున్నట్లు సమాచారం.

లైసెన్స్‌డ్ దుకాణాలకు ఆదాయ వనరు 'బెల్ట్'

గ్రామాల్లో నిర్వహించే బెల్టు దుకాణాలే లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల యాజమాన్యాలకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. దీంతో టీడీపీ నేతలే వాటిని ప్రోత్సహించి పల్లెల్లో టీడీపీ కార్యకర్తలు ఉపాధి పొందేలా చూస్తున్నారు. నందవరం మండలంలో బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసే అంశంపై సామాజిక మాధ్యమాల్లో ఓ ఆడియో వైరల్ అయింది. దీంతో మండలంలోని టీడీపీ రెండు గ్రూపుల మధ్య వివాదం చెలరేగింది. మంత్రాలయం పుణ్యక్షేత్రంలో బెల్టు షాపుల నిర్వహణ విషయంలో టీడీపీలోని అసమ్మతి నాయకులే ధర్నా చేశారు.



డోన్‌లో మందుబాబు పరిస్థితి

☛ డోన్ అసెంబ్లీ నియోజకవర్గంలో 16 మద్యం దుకాణాలకు ప్రభుత్వం అనుమతిచ్చింది. అయితే మున్సిపల్ మాజీ చైర్మన్ ఒకరు మాజీ ప్రజాప్రతినిధి పేరు చెప్పి ఊరూరా బెల్టు షాపులు ఏర్పాటు చేయించారు. ఇందుకు ఒక్కో దుకాణదారు నుంచి రూ.25 వేల దాకా వసూలు చేశారు. మల్కాపురం, జలదుర్గం వంటి మేజర్ గ్రామ పంచాయతీలో 10కి పైగా బెల్టు దుకాణాలకు అనుమతినిచ్చి వారి నుంచి రూ.25 వేలు నుంచి రూ.30 వేలు చొప్పున వసూలు చేసినట్లు సమాచారం. ఒక్క డోన్ నియోజకవర్గంలోనే దాదాపు 500 పైగా బెల్టు దుకాణాలు ఉండటం గమనార్హం.



☛ ఆలూరు నియోజకవర్గంలో 11 లైసెన్స్‌డ్ దుకాణాలకు అనుమతినివ్వగా టీడీపీ నేతలు రెండు గ్రూపులుగా ఏర్పడి నియోజకవర్గమంతా బెల్టు షాపులను ప్రోత్సహించి మామూళ్లు దండుకుంటున్నారు. ఒక్కో బెల్టు షాపు నిర్వాహకుడి నుంచి రూ.50 వేల దాకా పచ్చ నేతలు మామూళ్లు వసూలు చేసినట్లు ఓ మద్యం వ్యాపారి తెలిపారు. హొళగుంద, హాలహర్వి మండలాలకు చెందిన టీడీపీ నాయకులకు అటు కర్ణాటక, ఇటు ఏపీలోనూ మద్యం దుకాణాలు ఉన్నాయి. దీంతో జిల్లా సరిహద్దులో దుకాణాలు ఏర్పాటు చేసి కర్ణాటక మద్యాన్ని అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.



నందికొట్కూరు: బెల్ట్ షాపులో మద్యం తాగుతున్న దృశ్యం

ఆటోల ద్వారా బెల్టుకు సరఫరా

ఉమ్మడి జిల్లాలో పోటీ పడుతూ బెల్టు దుకాణాల నిర్వాహకులను మద్యం వ్యాపారులు(లైసెన్స్‌దారులు) రాబట్టుకుంటున్నారు. నియోజకవర్గాల వారీగా కొందరు ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి నాయకులకు నెలకు రూ.50 వేల నుంచి రూ.లక్ష ముడుపులు ముట్టజెబుతున్నట్లు వ్యాపార వర్గాలు చర్చ జరుగుతోంది. ప్రధానంగా ఎమ్మిగనూరు, డోన్, శ్రీశైలం, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో నేతలకు మద్యం మామూళ్లు ముడుతున్నట్లు సమాచారం. పట్టణ ప్రాంతాల వ్యాపారులు ఆటోల ద్వారా గ్రామాల్లో ఉన్న బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారు. బెల్టు నిర్వాహకులు కూడా టీడీపీ కార్యకర్తలే కావడంతో పోలీసులు అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి.

తాగుడుకు బానిసలై జీవితాలు నాశనం



నిరుపేదలు సంపాదించిన సొమ్ములో అధిక శాతం తాగేందుకే తగలేస్తున్నారు. తాగుడుకు బానిసలై ఎంతో మంది జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. బెల్టు షాపులు పుట్టగొడుగులను తలపిస్తుండటం చూస్తే టీడీపీ నేతల ధన దాహం ఇట్టే అర్థమవుతుంది. మద్యం మత్తులో ఎన్నో ఘోరాలు చోటు చేసుకుంటున్నాయి. వీటికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి.

– పి.నిర్మల, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, న్యాయవాది

దందా సాగుతోందిలా..

- కోడుమూరు, పాణ్యం, డోన్, పత్తికొండ, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో బెల్టు దుకాణాల వెనక నియోజకవర్గ ప్రతినిధులే క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు.
- ఆళ్లగడ్డ, ఆత్మకూరు, బనగానపల్లె నియోజకవర్గాల పరిధిలోనూ నేతలతో ఒప్పందాల మేరకు బెల్టు దుకాణాలు ఏర్పాటయ్యాయి.
- బెల్టు దుకాణాల నిర్వాహకులకు కూటమి నేతల అండదండలు ఉండటంతో పోలీసులు సహాయ సహకారాలు ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.
- కోడుమూరు నియోజకవర్గానికి సంబంధించిన ఓ ముఖ్య నేత కర్నూలు సంతోష్ నగర్‌లో ఉన్న దుకాణం నుంచి కర్నూలు మండలంలో గ్రామగ్రామాన బెల్టు షాపులకు సొంత వాహనం ద్వారా మద్యం సరఫరా చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది.
- ఆదోని, ఆలూరు, పత్తికొండ, మంత్రాలయం పరిధిలోని బెల్టు దుకాణాల్లో కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు జోరుగా విక్రయిస్తున్నారు. ఇందుకు స్థానిక నాయకుల అండదండలున్నట్లు తెలుస్తోంది.

దాడులను ముమ్మరం చేస్తాం



క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి బెల్టు షాపులను తొలగిస్తాం. అందిన సమాచారం మేరకు దాడులు చేస్తున్నాం. పొరుగు రాష్ట్రాల మద్యాన్ని ఎక్కడికక్కడ అరికడుతున్నాం. బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసే వ్యాపారుల లైసెన్సు రద్దు చేస్తాం.

– సుధీర్ బాబు, జిల్లా ఎక్సైజ్ అధికారి

న్యూస్‌రీల్

మార్కెట్ కమిటీలకు చైర్మన్‌ల నియామకం?

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాలుగు మార్కెట్ కమిటీలకు చైర్మన్‌ల నియామకం ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులు ఇచ్చిన జాబితాల మేరకు వీరి నియామకం దాదాపు ఖరారైనట్లు సమాచారం. నంద్యాల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గుంటుపల్లి హరిబాబు, పాణ్యం కమిటీ చైర్మన్‌గా ఏ.గీత, పత్తికొండ మార్కెట్‌కు నబీసాహెబ్, ఎమ్మిగనూరు మార్కెట్‌కు కురువ మల్లయ్యలను ఎంపిక చేసినట్లు చర్చ జరుగుతోంది. జిల్లా మార్కెటింగ్ శాఖ నుంచి ప్రతిపాదనలు పంపిన తర్వాత ప్రభుత్వం జీవోలు విడుదల చేయనుంది.

ఈఓఆర్‌డీ సస్పెన్షన్

కర్నూలు(అర్బన్): జిల్లాలోని పత్తికొండ గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి ప్రస్తుతం పదోన్నతిపై అనంతపురం జిల్లా పామిడిలో ఈఓఆర్‌డీగా పనిచేస్తున్న డీఆర్ క్రిష్ణ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ పీఆర్‌అండ్‌ఆర్‌డీ కమిషనర్ వీఆర్ క్రిష్ణతేజ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన పత్తికొండలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో కాంట్రాక్ట్ వర్కర్స్ జీతాలకు సంబంధించి రూ.1,33,27,673 డ్రా చేశారు. అందులో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రూ.74.63 లక్షలను ఒక కాంట్రాక్ట్ వర్కర్ ఖాతాలోకి మళ్లించి తిరిగి డ్రా చేసుకున్న ఆరోపణలపై విచారణ నిర్వహించారు. అలాగే గ్రామ పంచాయతీ నిధుల వినియోగంలో అక్రమాలు చోటు చేసుకున్నందున ఆయనను సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

11 మంది వీఎస్‌ఏలకు పదోన్నతులు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో గ్రామ సెరికల్చర్ సహాయకులుగా పనిచేస్తున్న 11 మందికి పదోన్నతులు లభించాయి. వీఎస్‌ఏలకు పట్టుపరిశ్రమ శాఖ సాంకేతిక సహాయకులుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇంతవరకు వీరు పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో పనిచేశారు. సాంకేతిక సహాయకులుగా పదోన్నతులు లభించడంతో వీరంతా పట్టుపరిశ్రమ శాఖ ఆధీనంలోకి వచ్చారు. ఖాళీ అయిన ఈ స్థానాలను ప్రత్యామ్నాయంగా వ్యవసాయ శాఖ భర్తీ చేస్తుంది. నాగలింగం, శ్వేతలను నంద్యాల పట్టుపరిశ్రమ అధికారికి, ఆరవిదు, కే.కలాం, రాజేశ్వరీ, పుల్లయ్యలను ఆత్మకూరు ఏడీకి, మాధవీలత, సావిత్రి, మోహన్‌ప్రసాద్, శివతేజ, పుల్లయ్యలను కర్నూలు పట్టు పరిశ్రమ అధికారికి కేటాయించారు.

పోలీసు నియామకాలు వెంటనే చేపట్టాలి

కర్నూలు(సెంట్రల్): రెండున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పోలీసు రిక్రూట్‌మెంట్‌ను వెంటనే పూర్తి చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరుద్యోగులు ఆందోళన చేపట్టారు. గతంలో పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ పోలీసు అభ్యర్థులకు ఇచ్చిన మాట ప్రకారం వెంటనే మెయిన్స్ పరీక్ష నిర్వహించాలన్నారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న అంశంపై ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పోలీసు రిక్రూట్‌మెంట్‌ను పూర్తి చేస్తామని నారా లోకేష్ చెప్పారని, అయితే అధికారం చేపట్టి పది నెలలైనా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. మరోవైపు డీఎస్సీ నోటిఫికేషన్‌ను మార్చిలో విడుదల చేస్తామని విద్యాశాఖ మంత్రి లోకేష్ చెప్పినా విడుదల కాలేదన్నారు. చివరకు సీఎం చంద్రబాబునాయుడు ఏప్రిల్‌లో విడుదల చేస్తామని చెబుతున్నారని, ఎన్నిసార్లు మాట మారుస్తారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. సీఎం మొదటి సంతకం చేసిన డీఎస్సీ ఫైల్‌నే ప్రభుత్వం తొక్కిపెట్టిందని విమర్శించారు. పోలీసు రిక్రూట్‌మెంట్‌ను వెంటనే పూర్తి చేయకపోతే రోడ్డెక్కుతామని హెచ్చరించారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నిరుద్యోగులు



స్వామి అమ్మవార్లకు ఆలయ ప్రదక్షిణ నిర్వహిస్తున్న దృశ్యం

మహాదుర్గగా భ్రామరి

- కనులపండువగా కైలాస వాహనసేవ
- కన్నడ భక్తులతో పోటెత్తిన శ్రీశైలం
- నేడు ప్రభోత్సవం, నందివాహనసేవ, వీరాచార విన్యాసాలు

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాల్లో రెండోరోజు శుక్రవారం శ్రీగిరిలో భ్రమరాంబాదేవి మహాదుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారు ఎనిమిది భుజాలతో శోభిల్లుతూ భక్తులను కటాక్షించారు. శంఖం, చక్రం, గద, పద్మం, త్రిశూలం, ఖడ్గం ధరించి అభయమిచ్చారు. అక్కమహాదేవి అలంకార మండపంలో కైలాసవాహనాన్ని అధిష్టించిన స్వామిఅమ్మవార్లకు అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాదుర్గ అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారికి ప్రత్యేక హారతులిచ్చారు. మహాదుర్గగా అలంకృతులైన భ్రమరాంబాదేవిని, కైలాసవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను ఆలయ ప్రదక్షిణ నిర్వహించి రాజగోపురం మీదుగా క్షేత్రప్రధాన వీధుల్లోకి తొడ్కొనివచ్చారు. క్షేత్రపురవీధుల్లో కన్నడ భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకుని నీరాజనాలు సమర్పించారు. గ్రామోత్సవం గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు అక్కడి నుంచి బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు కొనసాగింది. గ్రామోత్సవంలో కోలాటం, చెక్కభజన, పగటి వేశాల ప్రదర్శన, బుట్టబొమ్మలు, గొరవయ్యల నృత్యం, తప్పెట్లు, కొమ్ము వాయిద్యాలు, జానపదడోలు, నందికోలు నృత్యాలు గ్రామోత్సవానికి మరింత వన్నెను తీసుకువచ్చాయి. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు, ఏఈఓలు, అధికారులు, సిబ్బంది, అర్చకులు, వేదపండితులు, అధికారులు పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో కళాకారుల ప్రదర్శన

నేడు వీరాచార విన్యాసాలు..

ఉగాది మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం సాయంత్రం 5గంటలకు ప్రభోత్సవం నిర్వహిస్తారు. అలాగే స్వామిఅమ్మవార్లకు నందివాహన సేవ, శ్రీభ్రమరాంబాదేవికి మహాసరస్వతి అలంకార సేవ నిర్వహిస్తారు. రాత్రి 10 గంటలకు వీరశైవుల వీరాచార విన్యాసాలు, అగ్నిగుండ ప్రవేశం నిర్వహిస్తారు. శివదీక్షా శిబిరాల వద్ద నిర్వహించే వీరాచార విన్యాసాల కార్యక్రమానికి దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేయగా, పోలీసు శాఖ పటిష్ట బందోబస్త్ చేపట్టారు.

నేరాల నియంత్రణకు 'డ్రోన్' నిఘా

కర్నూలు (టౌన్): నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాలతో నిఘా చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో సైతం డ్రోన్‌ను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. సబ్ డివిజన్ల వారీగా డ్రోన్ కెమెరాలను పంపామని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నట్లు పేరకున్నారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలోని పెట్రోల్ బంకుల వద్ద నేరాలపై ఆరా తీస్తున్నట్లు తెలిపారు. దొంగతనాలు, ఇతర నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న శివారు ప్రాంతాలను, నిశిత ప్రాంతాలకు డ్రోన్స్ పంపి నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

లోకాయుక్తను ఆశ్రయిస్తే పరిహారం

- పిడుగుపాటు బాధిత కుటుంబాలకు సూచన

కర్నూలు(సెంట్రల్): పిడుగుపాటు బాధిత కుటుంబాలు నేరుగా లోకాయుక్తను ఆశ్రయించి పరిహారం పొందాలని ఉప లోకాయుక్త జస్టిస్ పి.రజనీ సూచించారు. ప్రభుత్వం సకాలంలో పరిహారం ఇవ్వపోతే మధ్య దళారులను ఆశ్రయించి నష్టపోవద్దన్నారు. చిత్తూరు జిల్లా తిప్పిరెడ్డిపల్లెకు చెందిన ఎం.వరలక్ష్మీ భర్త ఎం.రామకృష్ణ, ఇద్దరు కుమార్తెలు పిడుగుపడి మృతిచెందారు. అయితే ఆమెకు ఎలాంటి పరిహారం అందలేదు. దీంతో ఆమె లోకాయుక్తను ఆశ్రయించడంతో డైరక్టర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు నోటీసులు ఇచ్చి పరిహారం మంజూరయ్యేలా ఉప లోకాయుక్త కృషి చేసింది. ఈక్రమంలో ఇటీవల ఒక్కొక్కరికీ రూ.4 లక్షలు చొప్పున ముగ్గురికి రూ.12 లక్షలను మంజూరు చేసి వరలక్ష్మీ ఖాతాలో ప్రభుత్వం జమచేసింది. ఉపలోకాయుక్త శుక్రవారం కేసును మూసివేసింది. పరిహారం కోసం నేరుగా లోకాయుక్తను ఆశ్రయించాలని పిడుగుపాటు బాధిత కుటుంబాలకు సూచించారు.

సాహితీవేత్త నారాయణాచార్యులకు నివాళి



నారాయణాచార్యుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): తెలుగు సాహితీకారుల్లో అగ్రగణ్యుడు, సరస్వతీ పుత్ర పద్మశ్రీ మహాకవి పుట్టపర్తి నారాయణాచార్యులు అని కలెక్టర్ పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నారాయణాచార్యుల చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. నారాయణాచార్యులు చిన్నతనం నుంచే రామాయణ, భాగవతం, భారత ఇతిహాసాలను చదివారని, 140కిపైగా గ్రంథాలు రచించారన్నారు. సంగీతం, సాహిత్యం, నాట్యంలో సుప్రసిద్ధులైన ఆయన 14 భాషల్లో పాండిత్యం చేశారని వివరించారు. ఆయన సేవలను మెచ్చిన కేంద్రం 1972లో పద్మశ్రీ తో సత్కరించిందన్నారు. డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సెట్కూరు సీఈఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

పెరిగిన బీటీ-2 పత్తి విత్తన ప్యాకెట్ ధర

కర్నూలు(అగ్రికల్చర్): బీటీ-2 పత్తి విత్తన ప్యాకెట్ల ధర పెరిగింది. 2024-25లో ధర రూ.864 ఉండగా.. 2025-26 సంవత్సరానికి రూ.901 కి పెరిగింది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు దాదాపు 20 లక్షల ప్యాకెట్లు అవసరమవుతాయి. ధర పెంచడంతో రైతులకు అదనంగా రూ.7.40 కోట్ల మేర భారం పడనుంది. విత్తన వ్యాపారులు కొన్ని బ్రాండెడ్ కంపెనీల బీటీ-2 ప్యాకెట్లను బ్లాక్‌లో విక్రయిస్తాయి. రైతులపై భారం మరింత పడే ప్రమాదం ఉంది. ప్యాకెట్‌లో 475 గ్రాముల పత్తి విత్తనాలు ఉంటాయి. ఇందులో 450 గ్రాములు బీటీ-2 పత్తి విత్తనాలు ఉంటాయి. 25 గ్రాములు నాన్ బీటీ పత్తి విత్తనాలు ఉంటాయి. బీటీ-2 ప్యాకెట్ ధరలను పెంచడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది.

వక్ఫ్ బిల్లుపై 'కూటమి' రెండు నాలుకల ధోరణి

- ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

బొమ్మలసత్రం: కేంద్ర ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టనున్న వక్ఫ్ సవరణ బిల్లుపై కూటమి ప్రభుత్వం రెండు నాలుకల ధోరణిని ప్రదర్శించటం సరికాదని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇఫ్తార్‌విందులో మైనారిటీల ఆస్తులు పరిరక్షిస్తామని కామెడీ చేశారన్నారు. కేంద్రానికి మద్దతుగా వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు తెలుపుతూ, ఇక్కడ మాత్రం ఆస్తులు పరిరక్షిస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇఫ్తార్ విందు సాక్షిగా వక్ఫ్ సవరణ బిల్లును తాము వ్యతిరేకిస్తున్నామని, తాము ముస్లింల వెన్నంటి ఉంటామని స్పష్టం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం హజ్‌హౌస్‌ను విజయవాడలో నిర్మిస్తామని కపట మాటలు చెబుతోందన్నారు. హాజీలకు అదనపు భారాన్ని చెల్లించకపోవటం కారణంగా వారు ఇతర రాష్ట్రాల నుంచి హజ్‌కు వెళ్తున్న కారణంగా విజయవాడలో ఇమిగ్రేషన్ పాయింట్ రద్దయిందన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, కౌన్సిలర్లు ఆరీఫ్‌నాయక్, కలామ్‌బాషా పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

క్లుప్తంగా

బాల్యమిత్రుల ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న స్నేహితులు

హొళగుంద: అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితునికి బాల్యమిత్రులు రూ.41 వేలు ఆర్థిక సహాయం చేశారు. ధైర్యంగా ఉండాలని, తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06లో మార్లమడికి గ్రామానికి చెందిన రామంజితో పాటు పలువురు చదువుకున్నారు. క్యాన్సర్‌తో బాధపడుతూ రామంజి.. కర్నూలులోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న 50 మంది బాల్య స్నేహితులు తలా ఇంత ఇచ్చి.. రూ.41 వేలు చేశారు. అందరి తరపున శుక్రవారం స్నేహితులు పెద్దహ్యాట మల్లయ్య, వార్డు సభ్యుడు చిన్న మల్లయ్య, తిమ్మారెడ్డి, సుధాశెట్టి, ద్యావన్నలు కర్నూలుకు వెళ్లి రామాంజిని పరామర్శించి రూ. 41,000 నగదును అతని చేతికి అందజేశారు.

విద్యుత్ చార్జీల భారం తగ్గించాలి



విద్యుత్ భవన్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం ప్రజలపై వేసిన విద్యుత్ ట్రూ అఫ్ చార్జీలను, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కొత్తబస్టాండు సమీపంలోని విద్యుత్‌భవన్ ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని చెప్పిన కూటమి నాయకులు తర్వాత ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు పేరుతో అడ్డగోలుగా చార్జీలు పెంచడం దారుణమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేంచిన టీడీపీ నేడు వాటిని ఏర్పాటు చేస్తూ వినియోగదారులపై భరించలేని భారం మోపుతోందని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల వల్ల వ్యాపార, పారిశ్రామిక వేత్తలపై ప్రతి నెలా రూ.5 వేల నుంచి రూ.30 వేల వరకు భారం పడుతుందన్నారు. అలాగే స్మార్ట్ మీటర్ల వల్ల వేలాది మంది మీటర్ రీడింగ్ సిబ్బంది ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టీ.రాముడు, రాధాకృష్ణ, ఎండీ ఆనంద్, ఓల్డ్‌సిటీ కార్యదర్శి రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు అరుణ, గురుశేఖర్, విజయ్ పాల్గొన్నారు.

అనుమానం పెనుభూతమై..



హత్యకు గురైన లక్ష్మీదేవి

వెలుగోడు:మోత్కూరు మజారా గ్రామమైన తిమ్మనపల్లి గ్రామంలో ఓ వివాహిత దారుణ హత్యకు గురైంది. కట్టుకున్న భర్తనే భార్యను కడతేర్చాడు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. రుద్రవరం మండలం చిన్న కంబలూరు గ్రామానికి చెందిన పసుల లక్ష్మీదేవి (32)కి తిమ్మనపల్లి గ్రామానికి చెందిన మధు చిన్ని కృష్ణతో వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరి సంసారం కొన్ని సంవత్సరాలు సజావుగా సాగింది. కాగా భార్యపై అనుమానం పెనుభూతమైంది. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం మధు చిన్ని కృష్ణ తన భార్య లక్ష్మీదేవి తలపై గొడ్డలి కామాతో దాడి చేయగా తీవ్ర రక్త గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి, వెలుగోడు ఏఎస్‌ఐ శేషా వలి గ్రామానికి చేరుకుని హత్యకు కారణాలపై ఆరా తీశారు. మృతురాలు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కన్నీటి సాగు.. కనిపించదా కరువు!

- కేవలం 15 మండలాల్లోనే కరువు ఉన్నట్లు ప్రతిపాదనలు
- నేడో, రేపో కరువు మండలాలను ప్రకటన
- రబీలో తీవ్రంగా నష్టపోయిన రైతులు
- రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు రావద్దనే తప్పుడు లెక్కలు



హాలహర్వి మండలం చింతకుంట్ల సమీపంలో వరి పైరును జీవాలు మేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): వరుణుడు కరుణించడు.. సాగునీరు పారదు.. పొలం పండదు.. అన్నదాతకు అప్పులే మిగులుతున్నాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వానికి కరువు కనిపించదు. కేవలం కొన్ని మండలాల్లో మాత్రమే కరువు ఉన్నట్లు ఒక ప్రకటన వస్తుంది. ఖరీఫ్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో అన్ని మండలాల్లో కరువు పరిస్థితి ఉండగా కేవలం రెండు మండలాల పేర్లు వచ్చాయి. రబీ పరిస్థితి అందుకు భిన్నంగా ఏమీ లేదు. అక్టోబరు నుంచి మార్చి నెల వరకు డిసెంబరు నెలలో మాత్రం ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. మిగిలిన నెలల్లో వర్షాభావ పరిస్థితులే నెలకొన్నాయి. సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. పంటలు వేసినా దిగుబడులు రాక.. గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడుతున్నా.. కేవలం 15 మండలాల్లోనే కరువు ఉన్నట్లు నివేదికలు వెళ్లాయి. రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు రావద్దనే సూచనలతో అధికారులు తప్పుడు లెక్కలు పంపారనే విమర్శలు ఉన్నాయి.

ఇదీ దుస్థితి..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 55 మండలాలు ఉన్నాయి. పంటలు పండక, దిగుబడులు రాక రైతులకు తీవ్ర నష్టాలు వచ్చినప్పటికీ 2024 ఖరీఫ్ సీజన్‌లో కొతాళం, పెద్దకడుబూరు మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా గుర్తించారు. రబీ సీజన్‌లో వర్షాలు లేక సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. సాగు చేసిన పంటలు కూడా పొగమంచు కారణంగా దెబ్బతిన్నాయి. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పడి పోయినా కేవలం 15 మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా ప్రతిపాదించారు.

సాగు విస్తీర్ణం హెక్టార్లలో

జిల్లా	సాధారణ సాగు	సాగైంది
కర్నూలు	1,17,287	86,859
నంద్యాల	1,75,720	1,38,666

- కర్నూలు జిల్లాలో కల్లూరు, కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, కోడుమూరు, గూడూరు, ఓర్వకల్లు, ఆస్పరి, వెల్దుర్తి, మద్దికెర, పత్తికొండ మండలాలను మాత్రమే కరువు మండలాలుగా గుర్తించేందుకు జిల్లా యంత్రాంగం ప్రతిపాదించింది.
- నంద్యాల జిల్లాలో సంజామల, బనగానపల్లె, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల, బేతంచెర్ల మండలాలను ప్రతిపాదించారు.
- డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి, డోన్ మండలాలు పూర్తిగా వర్షాధారంపైనే ఆధారపడి ఉన్నాయి. రబీలో ఈ మండలాల్లో సాగు భారీగా తగ్గిపోయింది. ఈ మండలాలను జిల్లా యంత్రాంగం పక్కన పెట్టడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది.
- జిల్లా యంత్రాంగం పంపించిన ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం ఒకటి, రెండు రోజుల్లో కరువు మండలాలను ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.
- కర్నూలు జిల్లాలో కరువు తీవ్రతను తగ్గించి కేవలం 10 మండలాలను, నంద్యాల జిల్లాలో 5 మండలాలను చేర్చారు.

దిగులే మిగిలింది!

రబీ సీజన్ అక్టోబరు నుంచి మొదలై మార్చి వరకు కొనసాగుతుంది. కరువు ప్రాంతాలను గుర్తించాలంటే ఆయా నెలల్లో నమోదైన వర్షపాతం వివరాలను పరిగణనలోకి తీసుకుంటారు. డిసెంబరు నెలలో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. అక్టోబరు, నవంబరు, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో వర్షాలు లేవు. ఐదు నెలల పాటు వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అక్టోబరు నుంచి డిసెంబరు వరకు 27 శాతం లోటు వర్షపాతం ఉంది. జనవరి నుంచి మార్చి వరకు ప్రతి నెల 47 శాతం లోటు వర్షపాతం ఉంది. వర్షాభావంతో శనగ, జొన్న, మినుముల్లో దిగుబడులు 60 శాతం వరకు పడిపోయాయి. ఈ విషయాన్ని పంట కోత ప్రయోగాలు స్పష్టం చేస్తున్నాయి. దిగుబడులు లేక రైతుకు దిగులే మిగిలినా రాష్ట్ర ప్రభుత్వం కరుణ చూపకపోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది.

భూగర్భ జలాల దుస్థితి ఇదీ...

మండలం	భూగర్భ జలం మీటర్లలో..
కోసిగి	31.49
ఆస్పరి	15.53
ప్యాపిలి	21.02
కొలిమిగుండ్ల	17.50
బేతంచెర్ల	17.46
ఎమ్మిగనూరు	14.5
పాములపాడు	13.50
ఓర్వకల్లు	13.83
నందికొట్కూరు	12.45

కరువున్నా కరుణ ఏదీ?

- గత ఏడాది ఫిబ్రవరి నెలతో పోలిస్తే ఉమ్మడి కర్నూలు జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. చెరువులు, కుంటలు ఎండిపోయి ఇప్పటికే వందలాది గ్రామాల్లో తాగునీటికి తీవ్ర సమస్య ఏర్పడింది. పశువులకు సైతం నీరు అందని దుస్థితి నెలకొంది. కరువు మండలాలను గుర్తించడంలో భూగర్భ జలాలు కీలకం. అయినా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు.
- కర్నూలు జిల్లాలోని వివిధ మండలాల నుంచి గత ఏడాది నవంబరు నెల నుంచే వలసలు మొదలయ్యాయి. కోసిగి, ఆదోని, పెద్దకడుబూరు, కౌతాళం, హాలహర్వి, హొళగుంద, మద్దికెర, దేవనకొండ, తుగ్గలి, హాలహర్వి తదితర మండలాల నుంచి వ్యవసాయ కూలీలు, సన్న, చిన్నకారు రైతులు వలస వెళ్లిపోయారు. రబీ కరువు ప్రతిపాదనల్లో జిల్లా పశ్చిమ ప్రాంతంలోని పలు మండలాలు లేవు.
- జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పెద్దకడుబూరు, కౌతాళం కరువు మండలాలకు సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ కోసం జిల్లా యంత్రాంగం డిసెంబరు నెలలోనే ప్రతిపాదనలు పంపింది. ఇంతవరకు రూ.25.24 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఊసే లేకుండా పోయింది.
- 2023 ఖరీఫ్ కరువు మండలాలకు సంబంధించి 41,857 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో తప్పులు ఉన్నందున రూ.60.59 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల కాలేదు. జిల్లా అధికారులు ఖాతాలను సరిచేసి పంపినప్పటికీ నిధుల విడుదల అతీగతీ లేకుండా పోయింది.
- 2023–24 రబీ కరువు మండలాలకు దాదాపు లక్ష మంది రైతులకు రూ.98 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల పెండింగ్‌లో ఉండిపోయింది. 2023 ఖరీఫ్ సీజన్, 2023–24 రబీ సీజన్, 2024 ఖరీఫ్ సీజన్‌లకు సంబంధించి పంటల బీమా పరిహారం విడుదల పెండింగ్ లోనే ఉంది.

విధి 'కాటేసినా'!



వృద్ధ అంధ తల్లిదండ్రులను కావడిలో మోసుకుంటూ తీర్థయాత్రలకు తీసుకెళ్లిన శ్రవణుడు గురించి పురాణాల్లో చదువుకున్నాం. ఈ చిత్రంలో తల్లితో కనిపిస్తున్న కుమారుడి గురించి తెలుసుకుంటే అభినవ శ్రవణుడు అనాల్సిందే. విధిరాతకు రోడ్డున పడిన తల్లీకుమారుడు దీనగాథ విన్నవారంతా అయ్యోపాపం అంటున్నారు. కర్నూలుకు చెందిన వృద్ధురాలు సరోజినిబాయిది పేద కుటుంబం. కుమారుడు రాముడు నాయక్ చిన్నప్పుడు గొర్రెల కాపరిగా పని చేస్తున్నప్పుడు పాము కాటు వేసింది. విషమించడంతో చివరకు కాలు తీసేశారు. వృద్ధురాలు కూడా కింద పడటంతో నడవలేని పరిస్థితి నెలకొంది. జీవనోపాధికి ఇద్దరూ భిక్షాటన చేస్తూ శుక్రవారం పాణ్యం చేరుకున్నారు. మండుటెండలో తల్లిని ట్రైసైకిల్‌లో కూర్చోబెట్టుకొని దివ్యాంగుడైన కుమారుడు తోసుకుంటూ వెళ్తూ కనిపించాడు. – పాణ్యం

సారా రహిత జిల్లాగా మార్చేందుకు కృషి



మాట్లాడుతున్న జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు

కోసిగి: నాటు సారా రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ ఎం. సుధీర్ బాబు తెలిపారు. శుక్రవారం కోసిగి ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 110 గ్రామాల్లో నాటుసారా తయారీ చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆయా గ్రామాల్లో నవోదయం 2.0లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ పోలీసులతో, ప్రచారం రథం ద్వారా ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. నాటు సారా స్థావరాలపై ముమ్మరంగా దాడులు చేస్తున్నామన్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం రవాణా పూర్తి తగ్గి పోయిందన్నారు. కర్ణాటక టెట్రా ప్యాకెట్లు అక్కడక్కడ సరఫరా అవుతోందని, వాటిని అరికట్టేలా సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. మద్యం అమ్మకాలతో జిల్లా ఆదాయం రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందన్నారు. కోసిగి ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి, జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

హడావుడిగా 'మీ సమస్య–మా పరిష్కారం'

రెండున్నర గంటల్లో ముగిసిన మంత్రి టీజీ భరత్ కార్యక్రమం



వినతులు స్వీకరిస్తున్న మంత్రి టీజీ భరత్, అధికారులు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్ శుక్రవారం నిర్వహించిన మీ సమస్య – మా పరిష్కారం కార్యక్రమం హడావుడిగా సాగింది. ప్రజల నుంచి అర్జీ రాగానే సంబంధిత అధికారులకు అప్పగించి పరిష్కారం అవుతుందని బాధితులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంగా..11.15 గంటలకు మొదలైంది. అప్పటి నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మౌర్య ఇన్ హోటల్‌లోని ఆర్య ఫంక్షన్ హాలులో నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలకు మంత్రి టీజీ భరత్ అందుబాటులో ఉండడం లేదనే విమర్శలు నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలుస్తోంది. సొంత పార్టీ వారే అధిష్టానానికి ఫిర్యాదు చేయడంతో ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు చెప్పుకునే ప్రయత్నం మంత్రి చేశారని తెలుస్తోంది. కార్యక్రమంలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, మునిసిపల్ కమిషనర్ రవీంద్రబాబు, టౌన్ డీఎస్పీ బాబు ప్రసాదు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో రూ.1.74 లక్షల అవినీతి

- పీడీ వెంకటరమణయ్య



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న పీడీ వెంకటరమణయ్య

మంత్రాలయం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనుల్లో రూ.1,74,469 అవినీతి జరిగినట్లు నిర్ధారించగా.. వాటిని వెంటనే రికవరీ చేయించాలని డ్వామా పీడీ వెంకటరమణయ్య ఆదేశించారు. శుక్రవారం మంత్రాలయం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ రాధ ఆధ్వర్యంలో 18వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. రికార్డులు సరిగ్గా లేనట్లు తేల్చారు. రూ.1,74,469 అవినీతి జరగగా రికవరీ చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు రూ.33వేలు అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు. ఇందులో అడిషనల్ పీడీ మాధవీలత, ఏపీడీ లోకేశ్వర్, ఏపీఓ తిమ్మారెడ్డి, ఈసీ శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

కాళికాంబకు తాళిబొట్ల హారం వితరణ



తాళిబొట్ల హారాన్ని ఈఓకు అందజేస్తున్న ఆలయ చైర్మన్ వాసు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానం చైర్మన్ దంపతులు ఆరవేటి శ్రీనివాసులు, అన్నపూర్ణమ్మ శుక్రవారం అమ్మవారికి తాళి బొట్ల హారాన్ని విరాళంగా ఇచ్చారు. దాదాపుగా రూ.8 లక్షల విలువైన 91.345 గ్రాముల బంగారు హారాన్ని ఆలయ ఈఓ లక్ష్మీ నారాయణకు అందజేశారు. అనంతరం వాసు దంపతులను శాలువా, మెమొంటోతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి సుబ్బాచారి, రాఘవేంద్రచారి, విజయ్‌కుమార్, రమేష్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో దోపిడీ దొంగల బీభత్సం

- రూ.60 వేల నగదు, రెండు సెల్‌ఫోన్ల చోరీ



బీరువాను పగలగొట్టిన దృశ్యం,సీసీ ఫుటేజ్ బాక్సును ధ్వంసం చేసిన దృశ్యం

ఆదోని రూరల్: పెట్రోల్ బంకులో దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. సిబ్బంది గొంతుపై కత్తులు పెట్టి బెదిరించి రూ.60 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లను చోరీ చేశారు. పెద్దతుంబళం గ్రామంలోని మాధవరం రోడ్డులో ఉన్న ఎస్సార్ పెట్రోల్ బంకుకు శుక్రవారం తెల్లవారుజామున బొలెరో వాహనంలో ఏడుగురు వచ్చారు. వారిలో ఐదుగురు పెట్రోల్ బంకులోకి చొరబడి తమ వాహనానికి పెట్రోల్ వేయాలని నిద్రిస్తున్న పెట్రోల్ బంకు సిబ్బంది ఈరన్న, తాయప్పలను లేపారు. పెట్రోల్ కొట్టించుకున్న అనంతరం సిబ్బంది గొంతుపై కత్తులు పెట్టి డబ్బులు ఎక్కడున్నాయో చూపించాలని బెదిరించారు. పెట్రోల్ బంకులో బీరువాను పగులగొట్టారు. సీసీ ఫుటేజీ బాక్సు, విద్యుత్ సరఫరా వైర్లను కత్తిరించి క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.60 వేలు, రెండు సెల్ ఫోన్‌లను దొంగలించుకుని వెళ్లారు. బొలెరో వాహనంలో కోసిగి వైపు వెళ్లిపోయినట్లు సీసీ ఫుటేజీలో తేలిందని ఎస్‌ఐ తెలిపారు. ఈరన్న, తాయప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పుచ్చకాయలపల్లెలో చోరీ

ఉయ్యాలవాడ: పుచ్చకాయలపల్లె గ్రామంలో సోముల లక్ష్మీదేవి గృహంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన సమాచారం మేరకు లక్ష్మీదేవి తనకున్న ఇద్దరు కుమారులు ఉద్యోగ రీత్యా పట్టణ ప్రాంతంలో నివాసం వుంటున్నారు. రోజులాగానే గురువారం కూడా తమ బంధువులైన బావ గారి గృహంలో నిద్రించింది. తెల్లవారిన తరువాత శుక్రవారం ఇంటికి వెళ్లి చూడగా తలుపులు తెరచి వుండడంతో లోపలికి వెళ్లి బీరువాలో పరిశీలించగా అందులో వున్న రెండు తులాల తాళిబొట్టు సరుడు, రూ. 10 వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన మహానంది

ఆస్పరి: ఆదోని – పత్తికొండ మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఆస్పరి సీఐ మస్తాన్‌వలి తెలిపిన వివరాల మేరకు.. పత్తికొండ మండలం అటికెలగుండు గ్రామానికి చెందిన బోయ మహానంది (40) గురువారం పని నిమిత్తం బైక్‌పై ఆస్పరికి చేరుకున్నారు. పని ముగించుకొని రాత్రి స్వగ్రామానికి బైక్‌పై తిరిగి వెళ్తుండగా పత్తికొండ నుంచి ఆస్పరి వైపు వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహానందిని ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేసి ఆదోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో డాక్టర్లు సూచన మేరకు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కొలుకోలేక మృతి చెందాడని సీఐ తెలిపారు. మృతుడుకి భార్య, ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బోల్తా పడిన కారు



కాలువలో పడిపోయిన కారు

అవుకు: అవుకు రిజర్వాయర్ సమీపంలోని కాలువలో ప్రమాదవశాత్తు కారు బోల్తా పడింది. అనంతపురం నుంచి నలుగురు వ్యక్తులు పనుల నిమిత్తం శుక్రవారం కారులో బనగానపల్లెకు బయలుదేరారు. అవుకు– చెర్లోపల్లె రహదారిలో రిజర్వాయర్ సమీపానికి రాగానే బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. డ్రైవర్ అప్రమత్తమై వెంటనే పక్కనే ఉన్న కాలువ వైపు కారు మళ్లించడంతో బోల్తా పడింది. కారులో ఉన్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం అవుకు సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించారు. వైద్య చికిత్స చేయించుకున్న వారు తిరిగి అనంతపురానికి వెళ్లిపోయారు.

ప్రాణం తీసిన విద్యుదాఘాతం



మృతిచెందిన గిరిపోగు ప్రతాప్

దేవనకొండ: గ్రామసభ కోసం వేసిన టెంటును తొలగిస్తూ విద్యుదాఘాతంతో కింద పడి ఒక యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన తెర్నెకల్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఉదయం గ్రామసభను నిర్వహించి రాత్రి 7:30 గంటల సమయంలో టెంటును తొలగిస్తున్నారు. ఈ క్రమంలో టెంటుపైభాగాన ఉన్న హెవీ విద్యుత్ లైన్‌కు గిరిపోగు ప్రతాప్ ప్రతాప్ (30) చేయి తగిలింది. విద్యుదాఘాతంతో ఆ యువకుడు 12 అడుగుల ఎత్తు నుంచి ఒక్కసారిగా సీసీ రోడ్డుపై పడ్డాడు. తలకు బలమైన గాయాలు తగలడంతో దేవనకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. గిరిపోగు ప్రతాప్‌కు వివాహం కాలేదు. తల్లి మునెమ్మ, ఒక అన్న, ఒక తమ్ముడు ఉన్నారు.



వాయనం



విక్రయానికి ఉంచిన చాటలు



చాటలను కొనుగోలు చేస్తున్న కన్నడ భక్తులు

ఆడపడుచుకు అగ్రాసనం

- శ్రీశైల భ్రమరాంబాకు కన్నడిగుల సారె
- తిరుగు ప్రయాణంలో తోబుట్టువులకు వాయనంతో స్వగ్రామానికి
- శ్రీశైలంలో చాటలకు పెరిగిన డిమాండ్




మల్లికార్జున స్వామి స్వరూపమైన కంబికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



అమ్మవారి గుర్తుగా కొనుగోలు చేసే ప్లాస్టిక్ బొమ్మలు

శ్రీశైలంటెంపుల్: కన్నడిగుల భక్తి భావంతో శ్రీగిరి క్షేత్రం పరవశించిపోతుంది. వందల కి.మీ పాదయాత్రగా చేరుకుని స్వామి అమ్మవార్లను దర్శించుకుని తరించిపోతున్నారు. ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు భ్రమరాంబాదేవిని తమ ఇంటి ఆడపడుచుగా భావించి ప్రత్యేకంగా తమ ఇంటి నుంచే సారెను తీసుకువస్తారు. ఈ సారెలో బియ్యం, బెల్లం, శనగబ్యాళ్లు, గోధుమపిండి, కొబ్బరిగిన్నె, పూలు, రవిక, చీర, తమ పొలాల్లో పండిన ధాన్యాన్ని తీసుకువచ్చి ఐదు రోజుల పాటు శ్రీశైలంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఈ సారెను అమ్మవారికి సమర్పిస్తారు. అలాగే మల్లికార్జున స్వామి స్వరూపంగా భావించే కంబికి (పల్లకీ) ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పాదయాత్రగా తరలివచ్చే భక్తులు ఈ కంబిని తమ సొంత గ్రామాల నుంచి భుజాన మోసుకుంటూ వస్తారు. ఈ కంబికి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉగాది ఉత్సవాలు ముగిసే వరకు పూజలు నిర్వహిస్తారు. శ్రీశైలం నుంచి తిరిగివెళ్లే సమయంలో భక్తులు తమ తోబుట్టువులు, ముత్తైదువుల కోసం ప్రత్యేక వాయనం తీసుకెళ్తారు. చీర, జాకెట్, గాజులు, పూలు, పసుపు, కుంకుమ, బెల్లం, విభూది, వివిధ రకాల పండ్లతో వాయనం తీసుకెళ్తారు. ఈ వాయనానికి తమ ఇంటి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తమ వారికి నూతన చాటల్లో అందిస్తారు. ఈ చాటలను కూడా శ్రీశైలం నుంచి తీసుకెళ్తారు. దీంతో శ్రీశైలంలో చాటల వ్యాపారం బాగా జరుగుతోంది. శ్రీశైలంలో ఎక్కడ చూసినా చాటల విక్రయాలే కనబడుతున్నాయి. కన్నడిగులు అధికసంఖ్యలో చాటలను కొనుగోలు చేస్తున్నారు. అలాగే అమ్మవారి గుర్తుగా బొమ్మను కొనుగోలు చేస్తారు.





తెలుగువారి తొలి పండగ వచ్చేస్తోంది. నూతనోత్సాహంతో ఉగాదిని ఆహ్వానించడానికి సిద్ధమవుతున్న వేళ... కొత్త తరానికి పండగల అర్థం తెలుస్తోందా? అంటే... 'పెద్దవాళ్లు చెబితేనే తెలుస్తుంది' అంటున్నారు ప్రముఖ రచయితలు రామజోగయ్య శాస్త్రి, అనంత శ్రీరామ్. ఉగాది ప్రత్యేకంగా ఇంకా ఈ ఇద్దరూ చెప్పిన విశేషాలు తెలుసుకుందాం.

కొత్త తరానికి చెబుదాం

- రామజోగయ్య శాస్త్రి

పండగలు జరుపుకోవడం ఎవరూ మానేయలేదు. పిండివంటలు చేసుకోవడానికైనా పండగలు చేసుకుంటున్నాం. పండగ పూట తల స్నానం చేసి, ఉగాది పచ్చడి తిన్న తర్వాతే మిగతా పనులు చేయాలని పిల్లలకు పెద్దలు చెప్పాలి. ఎప్పటికప్పుడు కొత్త తరానికి పాత తరంవాళ్లు చెబుతుండాలి. ఎందుకంటే పండగలన్నీ ముందు తరంవాళ్లు చేసుకుంటూ వచ్చారు కాబట్టి చెప్పడం వారి బాధ్యత. కొత్త తరాన్ని పాజిటివ్‌గా స్వాగతించాలి. వారూ వెల్‌కమింగ్‌గానే ఉంటారు. మన తానులో పెరిగిన ముక్కలు వేరేలా ఎలా ఉంటారు? కొత్త తరానికి పద్ధతులన్నీ కొత్తే. పోనీ ఇవాళ్టి పాత తరం అనుకున్నవారికి ఎవరు చెప్పారు? వారి ముందు తరంవారు చెబితేనే కదా వీరికి తెలిసింది. ఇది రిలే పందెంలాంటిది. ఒక తరానికి ఒక తరానికి సక్రమంగా విషయాలను అందజేయాల్సిన బాధ్యత ముందు తరానికి ఉంటుంది.

యువతని నిందించడం సరికాదు: ప్రపంచాన్ని రెండు రకాలుగా చూడొచ్చు. మంచి కోణంలో... దుర్మార్గపు కోణంలో... ఎప్పుడూ మొదటి కోణంలో చూస్తే మంచిది. అది కాదనుకుని యువత పెడదారి పట్టిందని, ఏదేదో జరిగిపోతోందని యువతరాన్ని నిందించడం సరికాదు. ఏదీ వక్రీకరించిన కోణంలో చూడొద్దు. ఫారిన్ కల్చర్ అంటున్నాం... విదేశాలు వెళ్లి చూస్తే ఇక్కడికన్నా ఎక్కువ అక్కడ పండగలు బాగా జరుపుకుంటున్నారు. అన్నమాచార్యుల కీర్తనలు కూడా పాడుతున్నారు. ఇక్కడితో పోల్చితే అమెరికా ఫాస్ట్ ఫార్వార్డ్ అనుకోవాలి కదా. కానీ అక్కడ మన సంప్రదాయాలు బతికే ఉన్నాయి. ఇక ఎప్పటికీ ఇండియా రామని తెలిసిన కుటుంబాలు కూడా తమ పిల్లలకు తెలుగు నేర్పిస్తున్నారు... మన సంప్రదాయాల గురించి చెబుతున్నారు. పిల్లలూ నేర్చుకుంటున్నారు.

యువతరం బాధ్యతగా ఉంటోంది: సారవంతమైన నేల అది (యువతరాన్ని ఉద్దేశించి). బీజం వేయడం అనేది మన చేతుల్లో ఉంది. ముందు తరం బాధ్యతగా ఉండి, తర్వాతి తరానికి దగ్గరుండి అన్నీ నేర్పించి, అన్నీ ఆచరించేలా చేయాలి. వీళ్లు పాటిస్తూ వాళ్లు పాటించేలా చేయాలి. పొద్దున్నే వీళ్లు స్నానం చేయకుండా... పిల్లలను స్నానం చేసి, పూజలు చేయమంటే ఎందుకు చేస్తారు? నువ్వు చేయడంలేదు కదా? అంటారు. ఒకవేళ మాటల రూపంలో చెప్పకపోయినా... ముందు తరం ఆచారాలు పాటిస్తుంటే వీళ్లు చూసి, నేర్చుకుంటారు... అనుసరించడానికి ఇష్టపడతారు. బోధించే విధానం సక్రమంగా ఉండాలి. ఫైనల్‌గా చెప్పేదేంటంటే... మనం అనుకున్నంతగా యువతరం ఏమీ దిగజారిపోలేదు. చెప్పాలంటే మనకన్నా ఇంకా బాధ్యతగా ఉంటూ, పాతా కొత్తా బ్యాలెన్స్ చేసుకుంటూ వెళుతున్నారు. ఈ కాలపు పిల్లలు ఇంటికీ, బయటికీ పర్ఫెక్ట్ బ్యాలెన్స్ తెలిసిన వాళ్లు. వాళ్లలో ఏదైనా లోపం ఉందీ అంటే... చెప్పేవాళ్లదే కానీ వాళ్లది కాదు. సో... ఏ పండగని ఎందుకు జరుపుకోవాలో విడమర్చి యువతరానికి చెప్పాల్సిన బాధ్యత ముందు తరానిదే. సంవత్సరాది ఎందుకు జరుపుకుంటున్నాం? ఉగాది పచ్చడి విశిష్టత వంటివి చెప్పి, పండగ అర్థం తెలియజేయాలి.

పండగ 'రుచి' చూపాలి

- అనంత శ్రీరామ్

పండగలు జరుపుకునే తీరు మారింది. పెళ్లిళ్లల్లో ఎప్పుడైతే మనకు లేని రిసెప్షన్ అని మొదలుపెట్టామో అలానే పండగలు జరుపుకునే తీరులోనూ మార్పు వచ్చింది. ఉగాది గురించి చెప్పాలంటే... మా ఊరులో ఐదు రోజులు ఉగాది జాతర జరుగుతుంది. మాది వెస్ట్ గోదావరి, యలమంచిలి మండలం, దొడ్డిపట్ల గ్రామం. జాతర సందర్భంగా ఊరేగింపులు అవీ చేస్తుంటారు. ఇప్పుడూ జరుగుతున్నాయి. కానీ ఇప్పుడు జాతరలో భాగంగా మేజిక్ షోస్ అంటూ వెస్టర్న్ కల్చర్ మిక్స్ అయిపోయింది. ఉగాది అంటే కవి సమ్మేళనాలు విరివిగా జరిగేవి. ఇప్పుడలా లేదు. ఎవరైనా విద్యావంతులు లేదా శాంతి సమాఖ్యలు వాళ్లు ఏదో టౌన్ హాలులో కవి సమ్మేళనాలు ఏర్పాటు చేసినా ఓ ఇరవై ముప్పైమంది ఉంటున్నారు... అంతే.

ఉగాది ప్రత్యేకం అమ్మవారి జాతర: ఇక మా ఊరి ఉగాది గురించి చెప్పాలంటే... మాణిక్యాలమ్మ మా గ్రామ దేవత. ఉగాది సమయంలో మాకు ఆ అమ్మవారి జాతర ఉంటుంది. ఉగాది ప్రత్యేకం అంటే ఆ జాతరే. ఐదు రోజులు ఘనంగా చేస్తారు. ఐదో రోజు అయితే అమ్మవారిని బాగా అలంకరించి, ఊరేగించి, తెప్పోత్సవం చేస్తారు. నేను ప్రతి ఏడాది దాదాపు మిస్ కాకుండా వెళతాను. ఈసారి కుదరదు.

ఆరు రుచులను సమానంగా ఆస్వాదించాలి: ఉగాది పచ్చడిలోని షడ్రుచుల గురించి చెప్పాలంటే... నేను 'ఒక్కడున్నాడు' సినిమాలో 'ఇవ్వాళ నా పిలుపు... ఇవ్వాలి నీకు గెలుపు... సంవత్సరం వరకు ఓ లోకమా...' అని పాట రాశాను. అది పల్లవి. పాట మొదటి చరణంలో రుచుల గురించి రాశాను. 'కొంచెం తీపి... కొంచెం పులుపు పంచే ఆ ఉల్లాసమూ... కొంచెం ఉప్పు... కొంచెం కారం పెంచే ఆ ఆవేశమూ... చేదూ వగరూ చేసే మేలూ... సమానంగా ఆస్వాదించమని ఇవ్వాళ నా పిలుపు' అని రాశాను. ఆరు విభిన్నమైన రుచులను సమానంగా ఆస్వాదిస్తేనే జీవితాన్ని పూర్తిగా అర్థం చేసుకోగలమని చెప్పడమే ఆ పాట ఉద్దేశం. అంటే... జీవితంలో ఎదురయ్యే పరిస్థితులన్నింటినీ సమానంగా స్వీకరించగలగాలి.

ఆ బాధ్యత పెద్దవాళ్లదే: ఇక నేటి తరం గురించి చెప్పాలంటే... ఇప్పుడు కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలతో హాలోవెన్ అంటూ రకరకాల వేషాలు వేయిస్తున్నారు. వేలంటైన్స్ డే అనీ ఇంకా వేరే ఎక్కడెక్కడ నుంచో తెచ్చిపెట్టుకున్న పండగలను జరుపుతున్నారు. అయితే పిల్లలకు మన పండగల గురించి చెప్పాలి. వేరే సంబరాలు ఎలా ఉన్నా కూడా మన పండగలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ఇలా పాత తరం ఆచరిస్తే కొత్త తరానికి అర్థం అవుతుంది. వాళ్లు మన సంస్కృతీ సంప్రదాయాలను ముందుకు తీసుకెళతారు. మా గ్రామంలో ఉగాది అంటే... ఇంట్లో పిల్లలకు వేప పూత, మామిడికాయలు, చెరుకు గడలు తెమ్మని టాస్కులు ఇచ్చేవారు. అవి తెచ్చే క్రమంలో మాకు పండగలు అర్థమయ్యేవి. అలా మా ముందు తరంవాళ్లు మాకు నేర్పించారు. కొత్త తరానికి మనం అలా నేర్పిస్తే వాళ్లు పాటిస్తారు. ముందు తరాలకు సంస్కృతీ సంప్రదాయాలను నేర్పించే బాధ్యత పెద్దవాళ్లదే.

- డి.జి. భవాని



6 రుచులు

ఆరోగ్య లాభాలు

ఉగాది పచ్చడిని సేవించే ఆచారం శాలివాహన శకారంభం నుంచి మొదలైనట్లుగా చరిత్రకారులు చెబుతారు. సంప్రదాయ పద్ధతిలో ఉగాది పచ్చడిని కొత్త మట్టికుండలో తయారు చేస్తారు. ఉగాది పచ్చడిలో వేపపూత, మామిడి పిందెలు, చింతపండు, ఉప్పు, మిరియాల పొడి, బెల్లం, అరటిపండు ముక్కలు ఉపయోగిస్తారు. వీటి వల్ల ఉగాది పచ్చడి ఆరురుచుల సమ్మేళనంగా తయారవుతుంది. ఉగాది పచ్చడిలో ఉపయోగించే పదార్థాలు, వాటి ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం....

బెల్లం, అరటి పండ్లు- తీపి

బెల్లం తీపిగా ఉంటుంది. ఎండ వేడిమి వల్ల కలిగే అలసటను పోగొట్టి, తక్షణ శక్తినిస్తుంది. బెల్లాన్ని అరటిపండుతో కలిపి తీసుకోవడం శ్రేష్ఠమని ఆయుర్వేదం చెబుతోంది. అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. అధిక రక్తపోటు, మూత్రపిండాల సమస్యలను అరటి పండు నిరోధిస్తుంది.

చింతపండు- పులుపు

ఉగాది పచ్చడి తయారీకి పాత చింతపండు ఉపయోగించడం మంచిది. పాత చింతపండు ఉష్ణాన్ని, వాత దోషాలను తగ్గిస్తుంది. బడలికను పోగొడుతుంది. జఠరశక్తిని పెంచుతుంది. మూత్రవిసర్జన సజావుగా సాగేందుకు దోహదపడుతుంది. వేసవిలో చింతపండు రసం తీసుకోవడం వల్ల ఉష్ణదోషాలు తగ్గుతాయని ఆయుర్వేదం చెబుతోంది.

ఉప్పు

రుచులకు రారాజులాంటిది ఉప్పు. ఉప్పులేని పప్పులు, కూరలు, పచ్చళ్లు రుచించవు. ఆహారంలో అనునిత్యం ఉపయోగించే ఉప్పు త్రిదోషాలను- అంటే, వాత పిత్త కఫ దోషాలు మూడింటినీ పోగొడుతుందని ఆయుర్వేదం చెబుతోంది. అయితే, ఉప్పును మోతాదులోనే వాడాలి.

మామిడి పిందెలు- వగరు

మామిడి కాయలు ముదిరితే పులుపుగా ఉంటాయి గాని, పిందెలు వగరుగా ఉంటాయి. మామిడి పిందెల వగరుదనం లేకుంటే, ఉగాది పచ్చడికి పరిపూర్ణత రాదు. మామిడి పిందెలలో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. మామిడి పిందెలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శరీరంలోని త్రిదోషాలను హరించి, శక్తిని కలిగిస్తాయని ఆయుర్వేదం చెబుతోంది.

వేపపూలు- చేదు

వసంతారంభంలో వేపపూలను తినే ఆచారం దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ ఉంది. దీనిని 'నింబకుసుమ భక్షణం' అంటారు. షడ్రసోపేతమైన ఉగాది పచ్చడిలో వేపపూలను ఉపయోగించడం మన తెలుగువాళ్లకే చెల్లింది. వేపపూలు కఫదోషాన్ని, క్రిమిదోషాలను పోగొడతాయి. జీర్ణకోశ సమస్యలను నివారిస్తాయి.

మిరియాల పొడి-కారం

మిరియాలను నేరుగాను, పొడిగాను వంటకాల్లో తరచుగా వినియోగిస్తూనే ఉంటాం. మిరియాలు రుచికి కారంగా ఉన్నా, శరీరానికి చాలా మేలు చేస్తాయి. మిరియాలు కఫదోషాన్ని, విష దోషాలను హరిస్తాయి. చర్మవ్యాధులను అరికట్టడమే కాకుండా, జీర్ణశక్తిని, శరీరంలోని జీవక్రియలను పెంచుతాయి. అందుకే సంప్రదాయ ఆయుర్వేద ఔషధాల్లో మిరియాలను విరివిగా ఉపయోగిస్తారు.



ఉగాది పచ్చడి

కావలసినవి: కొత్త బెల్లం - 100 గ్రాములు, పచ్చి మామిడి - ఒకటి (మీడియం సైజు), వేప పువ్వు - ఒక టేబుల్ స్పూన్, పచ్చి మిర్చి - రెండు (తురమాలి), ఉప్పు - చిటికెడు, చింతపండు - పెద్ద నిమ్మకాయంత (కొత్త చింతకాయల నుంచి సేకరించినది).


తయారీ: ● బెల్లాన్ని తురిమి, అందులో కొద్దిగా నీటిని చిలకరించి పక్కన ఉంచాలి. ● వేప పువ్వు కాడలు లేకుండా వలిచి పువ్వు రెక్కలను సేకరించి పక్కన ఉంచాలి. ● మామిడి కాయ మొదలు (సొన కారే భాగం) తీసేయాలి. కాయను నిలువుగా కోసి లోపలి గింజను కూడా తీసేయాలి. ఇప్పుడు మామిడి కాయను తొక్కతోపాటు సన్నగా ముక్కలు తరగాలి లేదా తురిమి బెల్లం నీటిలో వేయాలి. ● చింతపండు గుజ్జును చిక్కగా రసం తీసి పై మిశ్రమంలో కలపాలి. అందులో పచ్చిమిర్చి తురుము, ఉప్పు, వేప పూత వేసి కలపాలి. ఈ మిశ్రమం చిక్కగా ఉంటుంది. మరింత రుచి కోసం చెరకు ముక్కలు, మిగుల మగ్గిన అరటి పండు గుజ్జు కలుపుకోవచ్చు.



పూర్ణాలు

కావలసినవి: పచ్చిశనగ పప్పు - అర కేజీ, బెల్లం - అర కేజీ, యాలక్కాయలు - పది, బియ్యం - రెండు కప్పులు, పొట్టుతీసిన మినప గుళ్లు - కప్పు, ఉప్పు - రుచికి సరిపడా, ఆయిల్ - డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ: ● ముందుగా మినప పప్పు, బియ్యాన్ని శుభ్రంగా కడిగి ఆరుగంటల పాటు నానబెట్టుకోవాలి. శనగ పప్పుని కూడా కడిగి గంట పాటు నానబెట్టాలి ● నానిన బియ్యం మినప పప్పులని మెత్తగా రుబ్బి పక్కన పెట్టుకోవాలి ● నానిన శనగ పప్పుని కుకర్‌లో వేసి రెండు గ్లాసులు నీళ్లుపోసి మూడు విజిల్స్ రానివ్వాలి ● ఉడికిన శనగ పప్పులో బెల్లం వేసి మెత్తగా గరిటతో తిప్పుతూ దగ్గర పడేంత వరకు ఉడికించి, యాలుక్కాయల పొడి వేసి తిప్పి దించేయాలి ● శనగపప్పు మిశ్రమం చల్లారాక, ఉండలుగా చుట్టుకోవాలి ● బియ్యం, మినపగుళ్ల రుబ్బులో కొద్దిగా ఉప్పు వేసి తిప్పాలి. ఇప్పుడు శనగ పప్పు ఉండలను ఈ పిండిలో ముంచి ఆయిల్‌లో డీప్ ఫ్రై చేయాలి ● మీడియం మంట మీద గోల్డెన్ బ్రౌన్ రంగులోకి మారేంత వరకు వేయిస్తే తియ్యని పూర్ణాలు రెడీ.



పరమాన్నం

కావలసినవి: బియ్యం - అర కప్పు, పాలు - కప్పు, బెల్లం తురుము - ముప్పావు కప్పు, నెయ్యి - ముప్పావు కప్పు, జీడి పప్పు పలుకులు - రెండు టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి - అర టీస్పూను, పచ్చకర్పూరం - చిటికెడు.

తయారీ: ● ముందుగా బియ్యాన్ని కడిగి పదిహేను నిమిషాల పాటు నానబెట్టుకోవాలి ● ఒక గిన్నెలో పాలుపోసి కాయాలి. కాగిన పాలల్లో నానబెట్టిన బియ్యం వేసి తిప్పుతూ ఉడికించాలి. అన్నం మెత్తగా ఉడికాక దించి చల్లారనివ్వాలి ● స్టవ్ మీద మరో బాణలి పెట్టుకుని నెయ్యి వేయాలి. నెయ్యి వేడెక్కిన తరువాత జీడి పప్పు పలుకులు వేసి గోల్డ్ కలర్‌లోకి మారేంత వరకు వేయించాలి ● స్టవ్ మీద మరో పాత్ర పెట్టి బెల్లం తురుము వేయాలి. దీనిలో పావుకప్పు నీళ్లుపోసి సిరప్‌లా మారేవరకు ఉడికించి, చల్లారనివ్వాలి ● బెల్లం సిరప్‌లోనే యాలకుల డి, పచ్చ కర్పూరం వేసి తిప్పాలి ● బెల్లం సిరప్ చల్లారక అన్నంలో వేసి బాగా కలపాలి, దీనిలో మిగిలిన నెయ్యి, జీడిపప్పుతో గార్నిష్ చేస్తే పరమాన్నం రెడీ.



మామిడి కాయ పులిహోర

కావలసినవి: బియ్యం - కప్పు, పచ్చిమామిడి కాయ - మీడియం సైజుది ఒకటి, పచ్చికొబ్బరి తురుము - అర కప్పు, ఆవాలు - టీస్పూను, మినప పప్పు - టీస్పూను, పచ్చి శనగ పప్పు - టీ స్పూను, వేరుశనగ గుళ్ళు - రెండు టేబుల్ స్పూన్లు, కరివేపాకు - మూడు రెమ్మలు, పచ్చిమిర్చి తరుగు - రెండు టేబుల్ స్పూన్లు, ఎండు మిర్చి - నాలుగు, మెంతులు - పావు టీస్పూను, ఆయిల్ - నాలుగు టేబుల్ స్పూన్లు, పసుపు - పావు టీస్పూను, చింతపండు ఉసిరికాయంత, బెల్లం తురుము - రెండు టీస్పూన్లు, ఉప్పు - రుచికి సరిపడా.

తయారీ: ● ముందుగా బియ్యాన్ని శుభ్రంగా కడిగి అన్నం పొడి పొడిగా వచ్చేలా వండి ఆరబెట్టుకోవాలి ● మామిడి కాయ తొక్క తీసి ముక్కలుగా తరగాలి ● ఎండు మిర్చి, మెంతులు, అరటీస్పూను ఆవాలను దోరగా వేయించుకుని పొడిచేయాలి. ఈ పొడిలో పచ్చికొబ్బరి, మామిడికాయ ముక్కలు, చింతపండు, బెల్లం వేసి మెత్తగా గ్రైండ్ చేసి పక్కనపెట్టుకోవాలి ● స్టవ్ మీద బాణలి పెట్టి ఆయిల్ వేయాలి. ఆయిల్ వేడెక్కిన తరువాత ఆవాలు వేయాలి. చిటపటలాడాక మినప పప్పు, శనగ పప్పు, పచ్చిమిర్చి తరుగు, కరివేపాకు వేయాలి ● ఇవన్నీ వేగాక వేరుశనగ గుళ్ళు వేసి వేయించాలి. ఇవి వేగాక పసుపు, గ్రైండ్ చేసిన మామిడికాయ మిశ్రమం వేసి ఐదు నిమిషాలు వేయించాలి ● తరువాత రుచికి సరిపడా ఉప్పు వేసి, ఆరబెట్టిన అన్నాన్ని వేసి కలిపితే మామిడికాయ పులిహోర రెడీ.

వృథాని జీరో చేద్దాం

యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ... మార్చి నెల 30వ తేదీని జీరో వేస్ట్ డే గా గుర్తిస్తూ 2022, డిసెంబర్ 14వ తేదీన ఒక తీర్మానాన్ని చేసింది. యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ అప్పటి నుంచి మార్చి నెల 30వ తేదీని 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ జీరో వేస్ట్'గా గుర్తిస్తూ ప్రపంచాన్ని చైతన్యవంతం చేస్తోంది. ఈ ఏడాది ఫ్యాషన్ అండ్ టెక్స్‌టైల్ రంగాల వృథా మీద దృష్టి పెట్టింది.

పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న వాయు, నీటి కాలుష్యాలతోపాటు వస్త్రాల అవశేషాలు కూడా ప్రధానమైనవి. క్లాత్‌తో డ్రెస్ కుట్టిన తర్వాత వచ్చే మిగులు నదులు, కాలువల్లోకి చేరి నీటిలో, నీటి అడుగుల మట్టిలో నిలిచిపోతోంది. కొంతకాలానికి ఆ వస్త్రానికి అద్దిన రసాయన రంగులు నేలలో, నీటలో ఇంకుతాయి. ఇలా వేస్ట్ క్లాత్ కారణంగా కెమికల్ పొల్యూషన్ నీటిని, మట్టిని కూడా కలుషితం చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా దుస్తుల తయారీ విపరీతంగా పెరిగిపోయింది. 2000 సంవత్సరంలో ఉత్పత్తి 2015నాటికి రెండింతలైంది. ఏడాదికి 92 మిలియన్ టన్నుల టెక్స్‌టైల్ వేస్ట్ లెక్క తేలుతోంది. ఇది కాలువలు, నదుల్లోకి వెళ్తోంది. దీనిని అరికట్టడం కోసమే యూఎన్‌ఓ (యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్) ఈ ఏడాది ఫ్యాషన్ ఇండస్ట్రీ వేస్ట్ మీద దృష్టి పెట్టింది. ఫ్యాషన్, టెక్స్‌టైల్ రంగాలను జీరో వేస్ట్ దిశగా నడిపించడానికి మార్గాలను అన్వేషించాలంటోంది యూఎన్‌ఓ. హైదరాబాద్‌లో ఫ్యాషన్ ఇండస్ట్రీ నిర్వహిస్తున్న సుదీప కందుల ట్రిపుల్ ఆర్ (రీ యూజ్, రీ సైకిల్, రీ పెయిర్) అనే యూఎన్‌ఓ థీమ్‌ను రెండు దశాబ్దాలుగా అమలు చేస్తున్నారు.



మనసుంటే మార్గం ఉంటుంది!

సుదీప కందుల... ఆలన బొటీక్ పేరుతో చిన్న పిల్లల దుస్తుల డిజైనింగ ప్రారంభించి మూడు దశాబ్దాలవుతోంది. ఫ్యాషన్ ఇండస్ట్రీలో బొటీక్ కల్చర్ మొదలైన తొలినాళ్ల నుంచి బొటీక్ నడుపుతున్నారామె. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని భావించే సుదీప, ఆమె ఉద్యోగులు పాలిథిన్ కవర్ల వినియోగాన్ని తగ్గించడానికి మార్కెట్‌కెళ్లేటప్పుడు క్లాత్ బ్యాగ్‌ను వెంట తీసుకువెళ్తారు. బొటీక్‌లో ఉత్పన్నమయ్యే వేస్ట్ క్లాత్‌ను పునర్వినియోగంలోకి తీసుకురావడానికి అనేక మార్గాలనెంచుకున్నారు సుదీప. చిన్న ముక్కలతో నవజాత శిశువులకు, ఏడాది లోపు పిల్లలు ధరించడానికి వీలుగా కుట్టించి ఆర్ఫనేజ్‌కు ఇచ్చారు. అలా కుదరని వాటిని నగరంలోని ఒక ఎన్‌జీవోకి ఇస్తుంటారు. ఆ ఎన్‌జీవోలో అల్పాదాయ వర్గాల మహిళలకు ఆ క్లాత్‌తో చిన్న చిన్న పోట్లీ బ్యాగ్‌లు, పర్సులు తయారు చేసుకుంటారు. అలా కూడా పనికి రాని సన్నగా పొడవుగా రిబ్బన్ ముక్కల్లాంటి క్లాత్‌ని ఒక స్కూల్‌కి ఇస్తే వాళ్లు పిల్లల చేత డోర్‌మ్యాట్ మేకింగ్ వంటి క్రాఫ్ట్ ప్రాక్టీస్‌కి ఉపయోగిస్తున్నారు. ఇక ఎందుకూ పనికిరావనిపించే ముక్కలను ఒక కవర్‌లో జమ చేసి ఆ బొటీక్‌లో పని చేసే వాళ్లు దిండులో స్టఫింగ్‌గా నింపుకుంటారు. వ్యర్థాన్ని అర్థవంతంగా మారుస్తున్న సుదీప తన బొటీక్‌లో చిన్న ముక్క కూడా నేల పాలు కాకుండా ప్రయత్నం చేస్తున్నారు.

షాపింగ్ వ్యసనం



ఈ తరానికి షాపింగ్ ఒక వ్యసనంగా మారింది. యూఎస్, యూరప్‌ల నుంచి వాడిన దుస్తులు మూడవ ప్రపంచదేశాలకు డంప్ అవుతున్నాయి. అరేబియా షిప్పుల్లో గుజరాత్ తీరం నుంచి దేశంలోకి వస్తుంటాయవి. మన దగ్గర తయారయ్యే పాలియెస్టర్ వస్త్రాలకు తోడు ఆయాఖండాల నుంచి వచ్చిపడుతున్న దుస్తులు కూడా కలిసి డంప్ పెరిగిపోతోంది. పాలియెస్టర్ వస్త్రాలను ఫైబర్‌గా మార్చి కొత్త దుస్తులు తయారు చేసే క్రమంలో విడుదలయ్యే వ్యర్థాలు సముద్రాల్లోకి చేరి మైక్రోప్లాస్టిక్‌గా మారి తిరిగి మన మీదనే దుష్ప్రభావాన్ని చూపిస్తాయి. అలాగే పారేస్తున్న దుస్తులతో కాలువలు నిండిపోతున్నాయి.

- డాక్టర్ దొంతి నరసింహారెడ్డి, పర్యావరణ నిపుణులు

ఉత్పత్తి- కొనుగోలు పెరిగాయి

మనం కొంతకాలం వాడి ఇక పనికి రావని పారేస్తున్న వస్తువులు నిజానికి పనికిరానివి కాదు, వాటిని మరొక రకంగా మలుచుకుని ఉపయోగించుకోవడం మనకు చేతకాకపోవడమే. రీ యూజ్ చేయడం నేర్చుకోవాలి. నాచురల్ ఫైబర్‌తో వస్త్రాలు తయారుచేసినన్ని రోజులు వస్త్ర పరిశ్రమ, అనుబంధ పరిశ్రమల వ్యర్థాల గురించి మాట్లాడాల్సిన అవసరం రాలేదు. మ్యాన్‌మేడ్ ఫైబర్ ప్రవేశించిన తర్వాత ఎదురవుతున్న సమస్యలివన్నీ. నిజానికి వ్యర్థాల ఉత్పత్తి మనదేశంలోకంటే యూఎస్, యూరప్‌దేశాల్లో చాలా ఎక్కువ. అవసరానికి మించి ఉత్పత్తి చేయడం, అవసరానికి మించి కొనడం రెండూ పెరిగాయి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

జీరో వేస్ట్‌తో ద బెస్ట్

మార్చి 30 జీరో వేస్ట్ డే



● కంపోస్ట్ తయారీలో సొసైటీ సభ్యులు

ప్లాస్టిక్, ఆహార వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ పరికరాల వేస్ట్‌తో ఏటా ప్రపంచ వ్యాప్తంగా రెండు వందల కోట్ల టన్నుల చెత్త జమవుతోంది. ఇది పెరుగుతూ భూగ్రహాన్ని ముంచేసినా ఆశ్చర్యం లేదు. ఈ ప్రమాదాన్ని మన దేశంలో ముందుగా గ్రహించి అప్రమత్తమైన ప్రాంతం ఢిల్లీ, మాల్వీయ నగర్‌లోని నవజీవన్ విహార్ రెసిడెన్షియల్ సొసైటీ. రీయూజ్, రీసైకిల్‌ను ఫాలో అవుతూ జీరో వేస్ట్‌తో పర్యావరణప్రియమైన ప్రాంతాల్లో ఒకటిగా నిలిచింది.

దాదాపు ఏడేళ్ల కిందట... ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ మాల్వీయనగర్‌లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ మీద ఒక వర్క్‌షాప్ నిర్వహించింది. అందులో పాల్గొన్న నవజీవన్ విహార్ రెసిడెన్షియల్ సొసైటీ సభ్యులు ఆ వర్క్‌షాప్‌లో చెప్పినవి, చూపించినవి తమ కాలనీలో అమలు చేయడం మొదలుపెట్టారు. అక్కడ 250 ఇళ్లున్నాయి. ఉదయాన్నే ఇంటింటికి వెళ్లి తడి చెత్త, పొడి చెత్తను ఎలా వేరుచేయాలో వివరించి, కొన్నాళ్లపాటు పర్యవేక్షించారు సొసైటీ సెక్రటరీ, కంటివైద్యులు డాక్టర్ రూబీ మఖీజా. తతిమా సభ్యుల సహాయసహకారాలతో తడిచెత్తతో కాలనీలోనే కంపోస్ట్ తయారుచేయడం మొదలుపెట్టారు. ఆ ఎరువుతో కిచెన్, బాల్కనీ, రూఫ్ గార్డెన్స్‌ను ప్రోత్సహించారు. ఒక షెడ్డు లాంటిదీ ఏర్పాటు చేశారు.. ఇళ్లల్లో పాతపుస్తకాలు, దుస్తులు, ఆటబొమ్మలు, ఉపయోగంలో లేని వస్తువుల కోసం. ఆ కాలనీలో ఎవరికైనా ఏ వస్తువైనా అవసరం ఉంటే ముందు ఈ షెడ్డుకొచ్చి చూసి, అందులో తమకు కావలసింది లేకపోతేనే కొత్తది కొనుక్కోవాలి. అలా కాలనీ వాసులు తీసుకున్నవి పోనూ మిగిలినవి స్వచ్ఛంద సంస్థలకు ఇస్తారు అవసరమైన వాళ్లకు పంచేందుకు! ఈ కాలనీలో ప్లాస్టిక్ బ్యాన్. గుడ్డ సంచులనే వాడుతారు. నీటి వృథా, అదానూ సమర్థవంతంగా నిర్వహించుకుంటున్నారు. పిల్లలకు పర్యావరణం పట్ల అవగాహన కలిగించడానికి వారానికోసారి క్యాంప్ పెడతారు. అందులో పిల్లలను ఆడిస్తూ, పాడిస్తూ వాళ్లు ఎలక్ట్రానిక్ పరికరాలకు బానిసలు కాకుండా జాగ్రత్తపడుతున్నారు. వీళ్లో బ్రాడ్‌కాస్ట్ సిస్టమ్‌నూ ఏర్పాటు చేసుకున్నారు. ప్రతిరోజూ కాలనీలో జరిగే పర్యావరణపరిరక్షణ కార్యక్రమాలను వీడియోలుగా తీసి వాటిని సాయంకాలం ప్రసారం చేస్తారు. ఈ ప్రయత్నాలతో జీరో వేస్ట్‌లో దేశానికే స్ఫూర్తిగా నిలిచింది నవజీవన్ విహార్.